క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌కు బీజేపీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు ద్వారకా రవి మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడా చూసిన వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయన్నారు. వీధికుక్కల బెడద నుంచి పట్టణవాసులను రక్షించాలని కోరారు. అదేవిధంగా ఆషాఢమాసం సందర్భంగా పట్టణంలోని ఎల్లమ్మ, పోచమ్మ, దుర్గమ్మ, భవానీమాత ఆలయాలను అభివృద్ధి చేయాలన్నారు. సంగారెడ్డి మెయిన్ రోడ్డు, బైపాస్ రోడ్డుపై మట్టి పేరుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయకుమార్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అజయ్, బాలమురళీధర్, సతీష్, ప్రవీణ్, తులసిరెడ్డి, వెంకట్ ఉన్నారు.

పరిసరాల శుభ్రత పాటించండి



వైద్య శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): వర్షాకాలం కావడంతో ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీలలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత



ఎడ్యుకేషన్ కిట్స్ అందజేస్తున్న సభ్యులు

పటాన్‌చెరు: మండల పరిధిలోని రామేశ్వరం బండ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పార్కర్ హనీ ఫిన్ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ వారు శుక్రవారం ఎడ్యుకేషన్ కిట్స్‌ను అందజేశారు. అనంతరం మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకే అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని వివరించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ధరణి, మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



పాఠశాల పరిసరాల్లో దోమల మందు పిచికారీ చేస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డివిజన్ కార్పొరేటర్ పుష్ప అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాల్లో దోమల మందు పిచికారీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. లేదంటే దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సంపులు, పూల కుండీలు, రిఫ్రిజిరేటరుల వద్ద నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాథోడ్, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తైబజార్‌కు వీడని గ్రహణం

- నాలుగేళ్లుగా వేలం పాటకు దూరం
- టెండర్లకు ఎవరూ ముందుకురాని వైనం
- కాగితాలకే పరిమితమవుతున్న అధికారుల ప్రకటనలు
- మున్సిపల్ సిబ్బందితోనే డబ్బులు వసూళ్లు
- రెండుసార్లు వాయిదా పడిన తైబజార్ వేలం పాట



జోగిపేటలో సంత నిర్వహిస్తున్న చిరు వ్యాపారులు



జోగిపేట మున్సిపాలిటీ భవనం

ప్రతి మున్సిపాలిటీలో తైబజార్ వేలం పాటలు నిర్వహించాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నా జోగిపేట మున్సిపాలిటీలో మాత్రం తైబజార్‌కు గ్రహణం వీడటం లేదు. ఇప్పటివరకు అధికారులు రెండుసార్లు తేదీలను ప్రకటిస్తూ ప్రకటనలు సైతం చేశారు. అయినా టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా పడుతూ వస్తోంది. మళ్లీ మూడోసారి తేదీని ప్రకటించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. నాలుగేళ్లుగా తైబజారు వేలం పాటకు టెండర్లు జరగకపోవడం విశేషం. దీంతో ఎక్కడ ఆదాయం కోల్పోతామోనని మున్సిపల్ సిబ్బందితోనే డబ్బులు వసూలు చేయిస్తున్నారు. గతంలో తైబజారు వేలం పాట ద్వారా పశువుల సంత, మేకల సంత, కబేళాశాల, కూరగాయల సంత నుంచి మున్సిపాలిటీకి రూ.23లక్షల వరకు ఆదాయం వచ్చేది.

– జోగిపేట(అందోల్)

మూడోసారైన ప్రయత్నం ఫలించేనా?

మున్సిపాలిటీ పరిధిలో మొదటిసారి జూన్ 22వ తేదీన, రెండోసారి జూలై 1వ తేదీన వేలం పాట నిర్వహించేందుకు ప్రకటన చేసినా ఎవరూ ముందుకు రాకపోవడంతో మళ్లీ వాయిదా వేశారు. మూడోసారి కూడా నిర్వహించేందుకు కలెక్టర్ అనుమతి కోరుతూ మున్సిపాలిటీ నుంచి నివేదిక పంపించారు. దీంతో కలెక్టరేట్ కార్యాలయం నుంచి తేదీని ప్రకటించగానే వేలం పాట నిర్వహిస్తామని మున్సిపల్ అధికారులు అంటున్నారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.లక్ష డిపాజిట్ చేయాలన్న నిబంధనలను రూ.50వేలకు తగ్గిస్తూ సడలింపు ఇచ్చేలా తీర్మానం చేసే అవకాశాలున్నట్లు తెలిసింది.రూ.లక్ష డిపాజిట్ చెల్లించేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని భావించి పాలకవర్గం ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం.

మున్సిపాలిటీకి తగ్గిన ఆదాయం

గతంలో జోగిపేట ప్రాంతంలోనే ప్రతి ఆదివారం సంత నిర్వహించేవారు ఈ సంతకు చుట్టూ పక్కన గ్రామాలవారు క్రయ, విక్రయాలకు వచ్చేవారు. ప్రస్తుతం బ్రాహ్మణపల్లి, సుల్తాన్‌పూర్, దుంపలకుంట, చౌటకూర్ ప్రాంతాల్లో సంతలు నిర్వహిస్తుండటంతో ప్రతి ఆదివారం నిర్వహించే జోగిపేట సంతకు విక్రయదారులు లేక వెలవెలబోతోంది. దీంతో అనుకున్నంతగా ఆదాయం రావడంలేదని టెండర్లలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాలేకపోతున్నారు. మేకలు, పశువుల సంతలకు కూడా పశువులను విక్రయించేందుకు రైతులు రావడంలేదని సిబ్బంది అంటున్నారు.

కలెక్టర్ అనుమతి కోరాం



ఈ ఏడాది తైబజార్ వేలం పాట పాడేందుకు టెండర్ల కోసం రెండుసార్లు ప్రకటనలు జారీ చేశాం. అయినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. మూడోసారి కూడా నిర్వహించేందుకు కలెక్టర్ అనుమతి కోరాం. డిపాజిట్ తగ్గించాలన్న వినతులు వచ్చాయి. ఈ విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. కొన్నేళ్లుగా టెండర్లు జరగకపోవడంతో సిబ్బందితోనే వసూళ్లు చేయించాం. ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే తైబజార్‌లో డబ్బులు వసూలు చేస్తాం.

– తిరుపతి, మున్సిపల్ కమిషనర్, జోగిపేట

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ సీఐ రవికుమార్

పటాన్‌చెరు టౌన్: ప్రతిఒక్కరికీ సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని సైబర్ క్రైమ్ సీఐ రవికుమార్ అన్నారు. పట్టణంలోని ఆర్ జిన్ పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఎలా జాగ్రత్త పడాలి.. ఏ విధంగా నియమాలు పాటించాలి, సైబర్ నేరగాళ్లను ఏ విధంగా గుర్తించాలి తదితరు అంశాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా వేదికగా యువతను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అపరిచిత వ్యక్తి నుంచి వచ్చే రిక్వెస్ట్‌లను గుడ్డిగా నమ్మొద్దన్నారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను నమ్మకూడదని సూచించారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జగదీష్, సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంజీ రాములును గెలిపించండి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్: కోహీర్ మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలోని పిరమల్ ఫార్మా కంపెనీలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ తరఫున కార్మిక సంఘం అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న ఎంజి రాములును గెలిపించాలని మాజీ మంత్రి చంద్రశేఖర్ అన్నారు. కర్మాగారం వద్ద శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక పక్షపాతి అయిన రాములును గెలిపించడం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ విషయాన్ని కార్మికులు గ్రహించి రాములుకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు రామలింగారెడ్డి, హన్మంత్‌రావు పాటిల్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మక్సూద్, నర్సింహారెడ్డి, అర్షద్‌అలీ, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



అల్గోల్‌లో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని తుంకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌతమ్‌కుమార్ దంపతులను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. 12 సంవత్సరాల పాటు విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న సందర్భంగా బంగారు ఉంగరం తొడిగించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బస్వరాజ్, మాజీ సర్పంచ్, వార్డుసభ్యులు మాట్లాడుతూ పాఠశాలలో విద్యాప్రమాణాలు పెంపొందించారని గౌతమ్‌కుమార్ సేవలను కొనియాడారు. అదేవిధంగా అల్గోల్ గ్రామంలో కూడా బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

మునిపల్లి మండల పరిధిలో...

మునిపల్లి(అందోల్): మండలంలోని పెద్దగోపులారం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు సుజాత, సుధాకర్, రమేష్, సంగీత, సత్యనారాయణ, గోపాల్‌ను మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పాండు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాండు

విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: వర్షాకాలంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి మంజూరైన సబ్‌స్టేషన్ల పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సదాశివపేట, పెద్దాపూర్, ఆరుట్ల, రాజంపేట సబ్‌స్టేషన్‌లు పూర్తయితే లోఓల్టేజీ సమస్య నుంచి విముక్తి పొందవచ్చన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభమవుతాయని వివరించారు. పొలాల వద్ద ఒరిగిన స్తంభాలు, వేలాడుతున్న వైర్లులను గుర్తించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. వర్షాలతో విద్యుత్ తీగలు తెగిపోతే యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. సమావేశంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ నాయికోటి రామప్ప, మాజీ ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్

మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్

నారాయణఖేడ్: పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ అన్నారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 2, 3 వార్డుల్లో శుక్రవారం పరిశుభ్రతను పాటించండి.. వ్యాధులను నిర్మూలించండి పేరిట (ఫ్రైడే.. డ్రైడే) కార్యక్రమంలో భాగంగా స్థానికులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. వైస్‌చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్, మేనేజరు వెంకటశివయ్య, కౌన్సిలర్లు వివేకానంద్, స్వప్న అభిషేక్ షెట్కార్, సంధ్యారాణి రామకృష్ణ, నర్సింహులు, హన్మండ్లు, రాజేష్ చౌహాన్, మాజీద్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై దృష్టి సారించాలి

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని సింగితం, సంగాపూర్, రాయికోడ్ గ్రామాల్లో డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్, ఎంపీడీఓ ఎంఎం షరీఫ్ పర్యటించారు. ఈ సందర్భంగా పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాకాలం నేపథ్యంలో ఇంటి పరిసరాల్లో వర్షం నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణపై శ్రద్ధ వహించాలన్నారు. శానిటేషన్ పనుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు.

తడి, పొడి చెత్తను వేరువేరు చేయాలి

సదాశివపేట(సంగారెడ్డి): తడి, పొడి చెత్తను వేరు వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణపాటిల్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా 26వ వార్డులోని బసవేశ్వర మందిరంలో తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా నిలిచి ఉండే వర్షం నీటిని తొలగించాలని సూచించారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



ఫ్యాషన్ షోలో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాం ప్రసాద్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఉన్నత స్థాయిలో రాణించినప్పుడే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు గర్వంగా ఉంటుందన్నారు. 11ఏళ్లుగా పాఠశాలలో మంచి ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం 6వ తరగతి విద్యార్థులకు ఫ్యాషన్ షో, క్రీడాపోటీలను నిర్వహించారు. ఇంటర్మీడియట్ రెండో ఏడాది విద్యార్థులు మొదటి ఏడాది విద్యార్థులకు విందు ఇచ్చారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓ కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

జోగిపేట(అందోల్): మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న మొండి వైఖరి వీడనాడి నగదు బదిలీ పథకాన్ని రద్దు చేయాలని సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జోగిపేట ఎంఈఓ కృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులతో ప్రభుత్వాలు వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయన్నారు. నెలకు రూ.2వేల వేతనం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయని మండిపడ్డారు. ప్రతిరోజు గుడ్లు ఉడకపెట్టి ఇస్తున్నా సరైన రేటు ఇవ్వడం లేదన్నారు. రాగిజావ తయారు చేయడానికి ప్రతి స్కూలుకు గ్యాస్ చెల్లించాలని, రాగిజావకు అదనంగా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు. మధ్యాహ్నం భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేసి ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో మధ్యాహ్న భోజన యూనియన్ నాయకులు సావిత్రమ్మ, శంకరమ్మ, రాణమ్మ, లక్ష్మి, చంద్రమ్మ, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రోడ్డుకు మరమ్మతులు

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని మహబత్‌పూర్–శాపూర్, పాంపాడ్ గ్రామాల మధ్య గుంతలమయమైన రోడ్డుకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. పాంపాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హన్మన్నపాటిల్ గుంతలను మొరంతో పూడ్చి చదును చేయించారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్టిలో ఉంచుకుని సొంత డబ్బులు వెచ్చించి మరమ్మతు పనులు చేయించినట్లు హన్మన్న పాటిల్ తెలిపారు.

◆ విద్యార్థికి అభినందన

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని విస్లావత్ శ్వేత ఐఐఐటీ ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్వేతను స్ఫూర్తిగా తీసుకొని వచ్చే విద్యా సంవత్సరం మరింత మంది విద్యార్థులు ఐఐఐటీ ఎంపిక అయ్యేలా చదువుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు సంజీవరావు, ఉపాధ్యాయులు మల్లికార్జున్, విక్టర్ రవికుమార్, శైలజ, రాగ్యానాయక్, బాలకిషన్, మధుసూదన్, పద్మావతి, అనురాధ, మోహన్, చంద్రమోహన్, పూలమ్మ పాల్గొన్నారు.

◆ ఎస్‌ఐలుగా బాధ్యతలు స్వీకరణ

ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగం ఎస్‌ఐగా నరేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన రాజేందర్‌రెడ్డి చిరాగ్‌పల్లికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిరాగ్‌పల్లిలో విధులు నిర్వహించిన ఎస్‌ఐ ఝరాసంగంకు బదిలీపై వచ్చారు.

సిర్గాపూర్ ఎస్‌ఐగా వెంకట్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఎస్‌ఐగా వెంకట్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన మహిపాల్‌రెడ్డి సంగారెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. రాయికోడ్ ఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకట్‌రెడ్డిను సిర్గాపూర్ ఎస్‌ఐగా నియమిస్తూ ఎస్పీ రూపేష్ ఉత్తర్వులు జారీ చేశారు.

పుల్‌కల్ ఎస్‌ఐగా క్రాంతికుమార్

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ ఎస్‌ఐగా పాటిల్ క్రాంతి కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీకాంత్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో క్రాంతికుమార్ బదిలీపై వచ్చారు.

◆ చెక్కులు పంపిణీ

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్‌జోషి, తహసీల్దారు శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దారు శంభిరెడ్డి, మాజీ సర్పంచులు సంగారెడ్డి, శ్రీశైలం, నాయకులు గోపాల్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట మండల పరిధిలో...

జోగిపేట(అందోల్): అందోలు మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దారు భాస్కర్, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మనాభరెడ్డి, ఆక్సానిపల్లి పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు చిట్టిబాబు, సురేష్, హరికృష్ణాగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివరాజ్, నాయకులు ప్రవీణ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలంలోని వెంకటాపూర్ శివారులోని నవ్య వెంచర్‌లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన కుందన్ నవ్య వెంచర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి విధులకు వెళ్లిన ఆయన శుక్రవారం శవమైన కనిపించాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కోహీర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

◆ ఆర్‌ఎల్‌ఆర్ స్కూల్‌లో ఇంగ్లీష్ వండర్ వరల్డ్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ డాక్టర్ ఆర్‌ఎల్‌ఆర్ స్కూల్‌లో శుక్రవారం ఇంగ్లీష్ భాషపై అవగాహన కల్పించేందుకు ఇంగ్లీష్ వండర్ వరల్డ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్పెల్ బీ, ఎస్సే రైటింగ్, టంగ్ ట్విస్టర్, డిబేట్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ తూర్పు నిర్మలకు సన్మానం



జిన్నారం(పటాన్‌చెరు): టీఎస్ ఐఐసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన తూర్పు నిర్మలను శుక్రవారం కాంగ్రెస్ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణ, రమేష్, తులసీదాస్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ వర్షాలు కువవాలని రుద్రాభిషేకం

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రమైన గుమ్మడిదల గ్రామంలోని కృష్ణానంద సరస్వతి స్వామి ఆశ్రమంలో వర్షాలు కురవాలని శుక్రవారం రుద్రాభిషేకం నిర్వహించారు. మాధవానంద సరస్వతి స్వామి ఆశీస్సులతో వరుణ దేవుడి ఆశీస్సులు చేకూరాలని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు రుద్రాభిషేకం చేపట్టారు.

◆ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

నారాయణఖేడ్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రీతమ్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఖేడ్‌కు చెందిన దళిత నాయకులు ఉన్నారు. అనంతరం రాష్ట్ర డీజీపీగా నియమితులైన జితేందర్‌ను కార్యాలయంలో కలిసి ఎమ్మెల్యే సంజీవరెడ్డి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

◆ కార్పొరేషన్ చైర్మన్‌కు ఎంపీ సన్మానం

నారాయణఖేడ్: సంగీత నాటక అకాడమీ చైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అలైఖ్య పుంజాలకు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సంగీత నాటక అకాడమీ కార్యాలయంలో కలిసి సన్మానించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

◆ ఏఐటీయూసీలో చేరిక

నారాయణఖేడ్: నియోజకవర్గానికి చెందిన కార్మికులు లక్ష్మయ్య, సాయిలు, జైపాల్, నర్సింహులు, మహిపాల్, లింగమ్మ, సాయమ్మ తదితరులు శుక్రవారం సీఐటీయూ సంఘంలో నుంచి ఏఐటీయూసీ సంఘం జిల్లా నాయకులు చిరంజీవి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి సంఘం కండువాలు కప్పి ఆహ్వానించారు.